## క్లుప్తంగా

### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరాములు

**దేవరకొండ:** నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని ఆర్డీఓ శ్రీరాములు అన్నారు. బుధవారం దేవరకొండ ఆర్డీఓ కార్యాలయంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ గిరిబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 308 పోలింగ్ కేందాలను ఏర్పాటు చేశామని, అందులో సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం మండలాల వారీగా రివ్యూ నిర్వహించారు. సమావేశంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ ముబీన్, తహసీల్దార్‌లు, ఎస్ఐలు తదితరులున్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిక

**త్రిపురారం:** మండలంలోని కామరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా త్రిపురారం మండల అధ్యక్షుడు పాలగాని సైదులుగౌడ్, మేకల రాకేష్, కుక్కల రవి బుధవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు నర్సింగ్ యాదగిరి ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కుందూరు జయవీర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా గ్రామస్థాయిలో కార్యకర్తలు పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో కనగంటి భానుప్రకాశ్, మునినాయక్, పాష తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

**కొండమల్లేపల్లి:** విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త అరుణకుమారి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో వాయిస్ ఫర్ గరల్స్ సంస్థ ఆధ్వర్యంలో పది రోజుల పాటు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం పరిచయ పేరిట నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 165 మంది విద్యార్థినులు ఈ సదస్సులో పాల్గొనగా విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పీడీ శ్రీదేవి, సంస్థ సమన్వయకర్తలు శివాని, ఆరుషి, దుర్గా భవాని, అనిత, త్రిష, హర్షిక, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

**నాగార్జునసాగర్:** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో నాగార్జునసాగర్‌లోని డీఏవీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపారు. చెస్(అండర్-14)లో పాఠశాలకు చెందిన సీహెచ్. తపస్విని(6వ తరగతి) స్వర్ణ పతకం, ఎం. రిత్విక(7వ తరగతి) రజత పతకం, ఎన్. హేమశ్రీ(6వ తరగతి) కాంస్య పతకాలను సాధించారు. చెస్(అండర్-17)లో జి. గగన గీతిక(10వ తరగతి) స్వర్ణ పతకం, చెస్(అండర్-17) బాలుర విభాగంలో బి. విష్ణు రజత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను టీఎస్ జెన్‌కో సీఈ వి. మంగేష్‌కుమార్, ఎస్ఈ రఘురాం, రామకృష్ణారెడ్డి, డీఏవీ ఏఆర్ఓ జీఆర్‌కె. ప్రసాద్, హెడ్మాస్టర్ పి.బల్తజార్, పీఈటీ సాయికృష్ణ అభినందించారు.

### క్రీడాకారుల ఎంపికకు పోటీలు

**పెద్దవూర:** మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో శుక్రవారం, శనివారం మండలస్థాయి క్రీడాకారుల ఎంపికకు పోటీలు ర్వహిస్తున్నట్లు పెద్దవూర స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం కె. శ్రీనివాస్ తెలిపారు. స్కూల్ గేమ్స్ నిర్వహణకై బుధవారం పెద్దవూర జెడ్పీహెచ్ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు అథ్లెటిక్స్‌లో పోటీలు ఉంటాయని వివరించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనపర్చిన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనవచ్చునని అన్నారు. సమావేశంలో పీడీ శోభారాణి, పీఈటీలు నారాయణరెడ్డి, లచ్చయ్య, పద్మ, కిరణ్, ఝాన్సీ పాల్గొన్నారు.

# శిలాఫలకానికే పరిమితం

- సంఘమిత్ర భవన నిర్మాణానికి స్థల సేకరణలో అధికారుల నిర్లక్ష్యం
- అద్దె భవనంలో అవస్థలు

**గుర్రంపోడు:** మండల కేంద్రంలోని సంఘమిత్ర భవన నిర్మాణం దశాబ్ద కాలంగా శిలాఫలకానికే పరిమితమైంది. నిధులు మంజూరైనా స్థల సేకరణ సమస్యతో భవన నిర్మాణం ముందుకుసాగడం లేదు. 2011లో అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి కుందూరు జానారెడ్డి మండల కేంద్రంలో ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25లక్షల నిధులు మంజూరు కాగా.. భవన నిర్మాణ పనులు ప్రారంభించడానికి నీటిపారుదల శాఖ నుంచి స్థలం ఇవ్వడానికి అనుమతి లభించాల్సి ఉంది. ప్రభుత్వ స్థలం కావడంతో అప్పటికే ఆ స్థలం పక్కనే పోలీస్ స్టేషన్, ఎంపీడీఓ, తహసీల్దార్, మండల విద్యావనరుల కేంద్రం లాంటి ప్రభుత్వ భవన నిర్మాణాలు జరగడంతో స్థలం అప్పగింత లాంఛనమనే భావించారు. కానీ అప్పట్లో మారిన నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్



అద్దె భవనంలో కొనసాగుతున్న సంఘమిత్ర భవనం

అనుమతి మాత్రమే గాక నీటిపారుదల చీఫ్ ఇంజనీర్ అనుమతి పొందాల్సి ఉండగా.. అందుకు ఆ శాఖ అధికారులు అనుమతించలేదు. దీనిపై పలుమార్లు ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు అనుమతి లభించలేదు.

**రెవెన్యూ అనుమతులు ఉన్నా..**

క్యాంపు కాలనీలో సర్వే నంబర్ 378లో ఎనిమిది గుంటల స్థలాన్ని మూడేళ్ల క్రితం సర్వే చేసి రెవెన్యూ శాఖ నివేదిక అందజేసింది. మారిన అంచనా వ్యయంతో భవన నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరయ్యాయి. అయినప్పటికీ పనులు మొదలుకావడం లేదు. దీంతో అద్దె భవనంలోనే సంఘమిత్ర కార్యాలయం కొనసాగుతోంది. ఇటీవల నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా.. స్థల సేకరణ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా భవన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**అవస్థలు పడుతున్నాం**



ప్రస్తుత అద్దె భవనంలో సరైన వసతులు లేవు. దాదాపుగా పది వేల మంది సంఘమిత్ర కార్యాలయం ద్వారా సేవలు పొందుతున్నారు. ఇరుకైన గదుల్లో సమావేశాలకు హాజరుకావాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు స్థల సేకరణ జరిపి భవన నిర్మాణం జరిగేలా చూడాలి.

– తరి ఉమారాణి, మండల సమాఖ్య అధ్యక్షురాలు

## ప్రజలు బీఆర్ఎస్‌కు అండగా నిలబడాలి



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భగత్

**హాలియా:** వచ్చే ఎన్నికల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలబడాలని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గుర్రంపోడు మండలంలోని పిట్టలగూడెం, నిడమనూరు మండలంలోని వెంకటాపురం, పెద్దవూర మండలంలోని చింతపల్లి, ఎర్రగుంటతండా గ్రామపంచాయతీలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల చేతగానితనం వల్లే నాగార్జునసాగర్ నియోజకవర్గం వెనుకబాటుకి గురైందన్నారు. కార్యక్రమంలో పెద్దవూర జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు, పెద్దవూర మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కర్ణ బ్రహ్మారెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వజ్జ ధనుంజయ, సీనియర్ నాయకులు పోలేని ముత్యాలు, ప్రధాన కార్యదర్శి రామగిరి చంద్రశేఖర్‌రావు ఉన్నారు.

## సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక

**దేవరకొండ:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. దేవరకొండ మండలంలోని ఉచరాల జర్పులతండాలో బుధవారం పలువురు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో మారుపాకుల సురేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, బిక్కు నాయక్ తదితరులున్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా దేవరకొండ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో రూ.2.06కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వైస్ చైర్మన్ రహత్‌అలీ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**మిర్యాలగూడ:** ఓటు హక్కును అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్య అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని విజేత కళాశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత ఓటు హక్కు గురించి గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తెల్ల ధనుంజయ, కళాశాల సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

**సెప్టెంబర్ 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు..**

**మిర్యాలగూడ:** సెప్టెంబర్ 19వ తేదీ వరకు ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీఓ బి. చెన్నయ్య తెలిపారు. బుధవారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు గాను ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బుధవారం పోలింగ్ బూత్‌ల వారీగా వచ్చిన దరఖాస్తులను రాజకీయ పార్టీలకు వివరించనున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 30వ తేదీ వరకు ఓటు నమోదు చేస్తామన్నారు. అక్టోబర్ మొదటి వారంలో తుది ఓటరు జాబితా విడుదల చేస్తామన్నారు. సెప్టెంబర్ 2, 3 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.

## విశ్వ గురువుగా భారతదేశం

**మిర్యాలగూడ టౌన్:** విశ్వగురువుగా భారతదేశం వెలుగొందాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సహ క్షేత్ర ప్రచారక్ శ్రీరామ్ భరత్‌కుమార్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎంవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార పారిశ్రామికవేత్త మేరెడ్డి రాహుల్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ విభాగ్ సంఘ చాలక్ గార్లపాటి వెంకటయ్య, విభాగ్ ప్రచారక్ కాసుల సత్యంజీ, విభాగ్ సంపర్క్ ప్రముఖ్ గూడూరు శ్రీనివాస్, నగర కార్యవాహ అంకిరేపల్లి సుధాకర్, సహ కార్యవాహ చెరుపల్లి కరుణాకర్ తదితరులున్నారు.

## ఆఫీస్ సబార్డినేట్‌కు సన్మానం



పూలమ్మ దంపతులను సత్కరిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది

**మిర్యాలగూడ అర్బన్:** మిర్యాలగూడ డిప్యూటీ డీఎంహెచ్ఓ కార్యాలయంలో గాదారి పూలమ్మ ఆఫీస్ సబ్‌ఆర్డినేటర్‌గా పనిచేసి బుధవారం పదవీ విరమణ చేసింది. ఈ సందర్భంగా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కేశా రవి పాల్గొని మాట్లాడారు. అనంతరం పూలమ్మను పూలమాల, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకయ్య, సుదర్శన్‌స్వామి, సోమ్లానాయక్, వాసుదేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

**దేవరకొండ:** నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి కాంగ్రెస్ నాయకులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్‌నాయక్ అన్నారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని బుధవారం దేవరకొండ డీఎస్పీ గిరిబాబుకు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జర్పుల లక్ష్మి, ఉమేర్, కొర్ర గౌతమి, సుజిత్‌యాదవ్, ఇంతియాజ్, రమేష్, పాండు ఉన్నారు.

**ఎస్ఐకి వినతి..**

**హాలియా:** కాంగ్రెస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌనీ రాజారమేష్‌యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాలియా ఎస్ఐ శోభన్‌బాబుకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాగార్జునసాగర్ నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజుయాదవ్, నాయకులు హనుమంత్‌రెడ్డి, కూరాకుల శ్రీనివాస్, వసంత్‌కుమార్, మేకల శ్రీకాంత్, నకిరేకంటి సైదులు తదితరులు ఉన్నారు.



దేవరకొండ: డీఎస్పీ గిరిబాబుకు వినతి పత్రం అందిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

## పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

**మిర్యాలగూడ టౌన్:** మున్సిపాలిటీలో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండాలోని అంశాలను చదువుతున్న సమయంలో పలువురు కౌన్సిలర్లు వార్డుల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ప్రధాన నాలాలతో పాటు డ్రెయినేజీల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో దోమలు విపరీతంగా వస్తున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రెయినేజీల్లో సిల్ట్ తీసే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి, కౌన్సిలర్లు తిరునగరు నాగలక్ష్మి, పత్తిపాటి సంజాత, ముదిరెడ్డి నర్సిరెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, రమేష్, జాని, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

**హాలియా:** మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డుకు చెందిన ఆకుల సైదులు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి బుధవారం మృతుడి కుమారుడు ఆకుల నరేష్‌కు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ప్రభావతి, సంజీవరెడ్డి, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

**డిండి:** మండల కేంద్రానికి చెందిన వావిల్ల లింగమయ్య అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. అంత్యక్రియల నిమిత్తం డిండి యువత చేయూత ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఏటి. కృష్ణ, బొల్లె శైలేష్ తదితరులున్నారు.

**మాడుగులపల్లి:** మండలంలోని చెరువుపల్లికి చెందిన కాంగ్రెస్ నేత వేముల గురవయ్య బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ, చంద్ర ఫౌండేషన్ చైర్మన్ తండు సైదులుగౌడ్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు నగదు, క్వింటా బియ్యం అందించారు. గురవయ్య పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయన వెంట పాల్వాయి సాగర్ తదితరులున్నారు.

## అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను రెగ్యులరైజ్ చేయాలి

**హాలియా:** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను రెగ్యులరైజ్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అవుతా సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు బుధవారం హాలియా పట్టణంలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు ఏసీడీపీఓ సువర్ణకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అవుతా సైదులు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు వేతనాలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, గ్రాట్యుటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు వర్తించేలా చూడాలన్నారు. లేదంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు రాజ్యలక్ష్మి, అచ్చమ్మ, అండాలు, వజ్రమ్మ తదితరులు ఉన్నారు.

## ఎక్స్‌గ్రేషియా అందించాలి

**మిర్యాలగూడ:** దామరచర్ల మండల కేంద్రంలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఐఈఆర్పీ సుజాత, ఆమె భర్త నవీన్ మెదక్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. బుధవారం దామరచర్లలో వారి చిత్రపటాలకు సమగ్ర శిక్ష ఉద్యోగులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల మండల అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మృతిచెందిన సుజాత, నవీన్ దంపతులకు 16నెలల పాప ఉన్నందున ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. అదేవిధంగా సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనం, హెల్త్‌కార్డులు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రవి, లక్ష్మమ్మ, పాండు, శారద, డేవిడ్, బంటు వెంకటేశ్వర్లు, నవనీత, వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి, సురేఖ, స్వప్న, విజయ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇళ్ల స్థలం కేటాయించాలి

**మాడుగులపల్లి:** మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ కాంగ్రెస్, సీపీఎం మండల నాయకులు బుధవారం తహసీల్దార్ జమీరొద్దీన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 15, 184,193,194, సర్వే నంబర్లలో ఉన్న సుమారు 11 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిని ఇంటి స్థలాలకు కేటాయించాలని కోరారు. నిరుపేదలు చాలా మంది స్థలం లేక ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారని, ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్లెంల సైదులు, నాయకులు భూపతి ఉషయ్య, బొడ్డు రమేష్, పార్వనబోయిన లక్ష్మణ్, పఠాని శ్రీను, బంటు రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఎస్పీ నాయకుల ముందస్తు అరెస్ట్

**కొండమల్లేపల్లి:** ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యపై అధికార పార్టీ నేతలు అక్రమంగా కేసులు బనాయించడాన్ని నిరసిస్తూ బుధవారం బహుజన సమాజ్ పార్టీ చలో సూర్యాపేట కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి మండలం నుంచి బీఎస్పీ నాయకులు తరలివెళ్లకుండా పోలీసులు ముందస్తుగా వారిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీఎస్పీ మండల అధ్యక్షుడు యాదగిరి ఉన్నారు.

**చింతపల్లిలో..**

**చింతపల్లి:** చలో సూర్యాపేట కార్యక్రమానికి వెళ్లకుండా బుధవారం పలువురు మండల బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీఎస్పీ మండల అధ్యక్షుడు ముదిగొండ మొగిలయ్య, కంబాలపల్లి యాదగిరి, పల్లె శ్రీకాంత్, నల్ల శ్రీకాంత్ తదితరులున్నారు.

**యాదవ సంఘం నాయకుల అరెస్ట్**

**మిర్యాలగూడ అర్బన్:** చలో సూర్యాపేట కార్యక్రమానికి వెళ్లకుండా మిర్యాలగూడ మండల యాదవ సంఘం నాయకులను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వట్టె జానయ్యపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో గుండెబోయిన నాగేశ్వర్‌రావు యాదవ్, ఎర్రయ్య, చేగొండి మురళియాదవ్, కట్టె శ్రీనివాస్, శ్రీనివాస్, శివాజి తదితరులున్నారు.

**అడవిదేవులపల్లిలో..**

**అడవిదేవులపల్లి:** వట్టె జానయ్యయాదవ్‌పై అక్రమ కేసులు బనాయించినందుకు నిరసనగా బుధవారం చలో సూర్యాపేట కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన మండల యాదవ సంఘం నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఎంపీటీసీ పేర్ల లింగయ్య, సైదయ్య, పున్నారావు, మధు తదితరులున్నారు.



చింతపల్లి: అరెస్టయిన బీఎస్పీ నాయకులు

**దేవరకొండలో..**

**దేవరకొండ:** బహుజన సమాజ్‌పార్టీ బుధవారం చలో సూర్యాపేటకు పిలుపునిచ్చిన నేపథ్యంలో దేవరకొండలో పలువురు బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నియోజకవర్గ నాయకులు ఎర్ర కృష్ణ, రమావత్ రమేశ్‌నాయక్ మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్యయాదవ్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లతో ఉద్యమాలను అణిచివేయలేదని అన్నారు. అరెస్టయిన వారిలో జాన్, వెంకటయ్య తదితరులున్నారు.

# పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు

**పెద్దవూర:** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు రక్షాబంధన్ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పోతునూరు యూపీఎస్ హెచ్ఎం బాణావత్ సక్రు నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**అభ్యాస్ టెక్నో స్కూల్‌లో..**

**మిర్యాలగూడ:** పట్టణంలోని అభ్యాస్ టెక్నో స్కూల్‌లో బుధవారం విద్యార్థులు రాఖీ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ వంగాల నిరంజన్‌రెడ్డి, కరస్పాండెంట్ వంగాల పుష్పలత, అప్పాల పాండురంగ, టీచర్లు పాల్గొన్నారు.

**కృష్ణవేణి స్కూల్‌లో..**

**హాలియా:** పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో బుధవారం రాఖీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్, జూనియర్ విద్యార్థులకు సోదరభావంతో రాఖీలు కట్టి మిఠాయి తినిపించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ నిమ్మల లక్ష్మారెడ్డి, ఏఓ సతీష్‌రెడ్డి, టీచర్లు పాల్గొన్నారు.

**నాగార్జున గ్రామర్ హైస్కూల్‌లో..**

**కొండమల్లేపల్లి:** మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ హైస్కూల్‌లో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ జార్జిరెడ్డి రాఖీ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చొని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాణిరూప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ: అభ్యాస్ టెక్నో స్కూల్‌లో రాఖీ కడుతున్న విద్యార్థులు

**శ్రీసాయి కృష్ణవేణి పాఠశాలలో..**

**పెద్దఅడిశర్లపల్లి:** మండల కేంద్రంలోని శ్రీసాయి కృష్ణవేణి పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ చిరంజీవి, టీచర్లు పాల్గొన్నారు.

**కస్తూర్బా గాంధీ విద్యాలయంలో..**

**చింతపల్లి:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




చింతపల్లి: కస్తూర్బా గాంధీ విద్యాలయంలో..



నిడమనూరు: ఆదర్శ పాఠశాలలో..

**ఆదర్శ పాఠశాలలో..**

**నిడమనూరు:** నిడమనూరు ఆదర్శ పాఠశాలలో బుధవారం రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు బాలురకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంజిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**◆ అదనపు కలెక్టర్‌కు వినతి**

**డిండి:** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గల శ్రీరేణుకా ఎల్లమ్మ దేవాలయం ముందు ఉన్న గ్రామకంఠం భూమిని ఆలయానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఏలేష్ బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. దేవాలయం చుట్టూ ఖాళీ స్థలం లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు గ్రామస్తులు ఉన్నారు.

**◆ భగవద్గీత శ్లోకాలపై పోటీలు**

**కొండమల్లేపల్లి:** త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కొండమల్లేపల్లిలోని సిద్దార్థ స్కూల్‌లో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హిందూ జ్ఞాన వేదిక నల్లగొండ కమిటీ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశం, సభ్యులు మేకల శ్రీనివాసులు, చంద్రమౌళి, చక్రధర్, పరమేశ్, రంగారెడ్డి, వెంకటమ్మ, కవిత, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**◆ విద్యార్థులకు కౌన్సిల్ ఎలక్షన్స్**

**మిర్యాలగూడ:** పట్టణంలోని ఢిల్లీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు కౌన్సిల్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ బాలాజీనాయక్, సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరి హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాయినాథ్‌నాయుడు, ప్రిన్సిపాల్ లక్ష్మీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**◆ వర్షాలు కురవాలని జలాభిషేకం**

**గుర్రంపోడు:** మండలంలోని ఆమలూరు గ్రామంలో వర్షాలు కరవాలని బుధవారం గ్రామస్తులు కప్పకాముడు ఆడి గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. వరద పాశం బండపై పోసి ప్రజలందిరితో తినిపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాల మల్లయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

**◆ లబ్ధిదారులు డబ్బులు చెల్లించాలి**

**అడవిదేవులపల్లి:** ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకొని వాటి క్రమబద్ధీకరణ కోసం జీఓ నంబర్ 59 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు చలానాలు చెల్లించాలని మండల తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని దరఖాస్తుదారుల ఇళ్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఒకటి, రెండు రోజుల్లో ప్రభుత్వం నిర్దేశిత రుసుమును ప్రకటిస్తుందని, దానిని దరఖాస్తుదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

**◆ నూతన కార్యవర్గం ఎన్నిక**

**మాడుగులపల్లి:** మండలంలోని ధర్మాపురం పంచాయతీ కార్యాలయంలో ఆ గ్రామ మత్స్య పారిశ్రామిక సొసైటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సింగారపు యాదయ్య ముదిరాజ్, వైస్ చైర్మన్‌గా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అర్జున్, డైరెక్టర్లుగా పూల పాపయ్య, సైదులు, దొండ సతీష్, బియ్య సోమేశ్వర్, కోటేష్, సింగారపు శ్రీను ఎన్నికయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతరెడ్డి యాదగిరిరెడ్డి, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు తవిటి సైదులు, ఎన్నికల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

**◆ నేడు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం**

**అడవిదేవుపల్లి:** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం భక్తాంజనేయస్వామి మూలవిరాట్‌కి వేద పండితులు అభిషేకాలు, యజ్ఞం, పుణ్యావచనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం పులుకూరి పెదసైదయ్య దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వేద పండితులు అనంత కృష్ణశర్మ, అనంత కృష్ణ పాల్గొన్నారు.

**◆ కిడ్నీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు**

**అడవిదేవులపల్లి:** మండలంలోని గోన్యతండాలో బుధవారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)–హైదరాబాద్ టీం ఆధ్వర్యంలో కిడ్నీ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మూత్రపిండాల పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఎంఆర్ హైదరాబాద్ టీం ప్రాజెక్ట్ అసిస్టెంట్‌లు హుస్సేన్, శ్రావణి, ప్రతి, స్వప్న, ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, వైద్యాధికారి నిపుణ్ అర్జర్, మౌనిక, ఏఎన్ఎం సైదమ్మ, ఆశా వర్కర్లు, స్థానికులు తదితరులున్నారు.